www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 10 నవంబర్ 2023
5
ఏలూరు

ఏలూరుకు 'ఉక్కు' పాదయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పాదయాత్ర చేపట్టిన గణేష్

కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను విరమించుకోవాలని కోరుతూ ఆ ఫ్యాక్టరీ కార్మికుడు గణేష్ వెంకటేశ్వర స్వామి మాల ధరించి విశాఖపట్నం నుంచి తిరుపతికి చేపట్టిన పాద యాత్ర గురువారం ఏలూరుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రయి వేటీకరణ ఆపాలని కోరుతూ ఈ పాదయాత్ర ప్రారంభించానని, ఆనాడు 32 మంది ప్రాణ త్యాగ ఫలితంగా స్టీల్ ప్లాంట్ ఏర్పడిందని వివరించారు. కానీ నేడు బిజెపి ప్రభు త్వం దాన్ని అమ్మాలని చూడటం దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫ్యాక్టరీని సంరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయనకు ఏలూరు నగరంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.విజయలక్ష్మి, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వి.సాయిబాబు స్వాగతం పలికారు.

పేదలు ఎదగాలి.. కార్పొరేట్లు కాదు

రాష్ట్రానికి ద్రోహం చేసిన మోడీకి జగన్ సాగిలం
పాచిపోయిన లడ్డు అన్నవారే నేడు మోడీ భజన
ప్రజారక్షణ భేరీ యాత్రలో సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/కలిదిండి

అభివృద్ధి చెందడమంటే కార్పొరేట్లు అభివృద్ధి చెందడం కాదని, ప్రజల ఎదుగుదలే నిజమైన అభివృద్ధి అని, పాలకులు చెబుతున్న అభివృద్ధి సామాన్యులకు చేరడంలేదని, సమగ్ర అభివృద్ధి అసమానతల్లేని సమాజం కోసమే ప్రజారక్షణ భేరీ యాత్ర చేపట్టినట్లు సిపిఎం రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. ప్రజారక్షణ భేరి బస్సు యాత్ర పశ్చిమగోదావరిర జిల్లా భీమవరం నుంచి ఉండి, ఆకివీడుమీదుగా ఏలూరు జిల్లా కలిదిండికి గురువారం చేరుకుంది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎస్.మహంకాళిరావు అధ్యక్షతన జరిగిన సభలో నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, బడ్జెట్ లోటు, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు నిధులు విడుదల వంటివి ఏ ఒక్కటీ మోడీ సర్కార్ ఇవ్వలేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తుందని విమర్శించారు. 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేసేందుకు చూస్తున్నారన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్‌లు, రైతులకు వ్యతిరేకంగా మరో మూడు నల్లచట్టాలు, విద్యుత్ సంస్కరణలను కేంద్రం తెచ్చిందన్నారు. రాష్ట్ర హక్కులను కాలరాసి తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రశ్నించాల్సిన జగన్ బిజెపికి సాగిలాపడుతున్నారని విమర్శించారు. ప్రజలకు నష్టం చేకూర్చే చట్టాలకు పార్లమెంట్‌లో మద్దతిస్తున్నారన్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు బిజెపి ముందు మోకరిల్లుతుండగా, పాచిపోయిన లడ్డు అని చెప్పిన పవన్‌కల్యాణ్ మోడీ మళ్లీ రావాలంటూ భజన చేస్తున్నారన్నారు. వీరంతా తోడుదొంగలని ఇది ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. గ్యాస్ సిలిండర్ నుంచి పెట్రోల్, డీజిల్, విద్యుత్ బిల్లులు అన్నీ పెంచేశారని, వీటి తగ్గింపునకు సిపిఎం ప్రత్యామ్నాయం చూపుతుందని వివరించారు. కేరళలో మద్దతు ధరకు అదనంగా పంటలకు రూ.750 ఇస్తుందన్నారు. రాష్ట్రంలో నాలుగు లక్షల మంది స్కీమ్ వర్కర్లు ఉన్నారని, వీరందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో కోటిమంది అసంఘటితరంగ కార్మికులున్నారని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అని చెప్పి 2024లో ఓట్ల కోసం ప్రణాళికలు రచించారన్నారు. మణిపూర్‌లో మహిళలపై దాడులు జరిగినా ఇక్కడ వైసిపి, టిడిపి, జనసేన ఒక్క మాటమాట్లడటం లేదన్నారు. ఇది సరైందికాదని, విధానాలు మారాలన్నారు. ఈనెల 15న విజయవాడలో బహిరంగ సభకు అందరూ తరలిరావాలన్నారు.

సిపిఎం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి బి.బలరాం మాట్లాడుతూ ఇతర పార్టీలు చేసే యాత్రలు జనంకోసం కాదని అధికారం కోసమేనన్నారు. దళితులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అసమానతలులేని సమానత్వం కోసం సిపిఎం యాత్ర చేస్తుందని తెలిపారు. రైతులు కష్టపడి పండిస్తే కొనేవారు ఉండరని, డబ్బులు రావని, ధరలో కోత పెడుతున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల పరిస్థితి మరింత దిగజారుతుందన్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయాయని తెలిపారు. ఆక్వా కంపెనీలు సిండికేట్‌గా మారిపోయాయన్నారు.

కలిదిండి సభలో మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

వినతిపత్రం అందిస్తున్న ఆశా వర్కర్లు

రైతులకు ఇచ్చే కౌలు రాయితీలు ఆపేశారన్నారు. కొల్లేరు ఆపరేషన్‌తో ఎంతోమంది ఉపాధి దెబ్బతిందన్నారు. కలిదిండిలో ఆక్వా పరిశ్రమలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతాంగాన్ని ఆదుకోవడంతోపాటు, ఉపాధి కల్పించాలని, మూతపడిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని కోరారు. ఏలూరుజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో ప్రజాసమస్యలు పేరుకుపోయాయన్నారు. పాలకపార్టీలు పట్టించుకోవడంలేదని, తాగునీరు కూడా అందడంలేదన్నారు. అక్రమంగా ఫ్యాక్టరీలు నిర్మించడంతో కాలుష్యం పెరిగిపోతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఇళ్లస్థలాల పట్టాలకోసం, స్కీమ్ వర్కర్లు యాత్ర బృందానికి వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాథం, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ధనలక్ష్మి, ఎం.హరిబాబు, కె.శ్రీనివాసరావు, జిల్లా నాయకులు సిహెచ్.బాబూరావు, గోపాలన్, సిపిఎం నాయకులు వి.భాస్కరరావు, ఎ.వెంకటేశ్వరరావు, డి.వెంకటసత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, జి.అనిల్ కుమార్, జోగి ఏసు, చిన్నం మాధవ, కనకారావు, గోసంగి వినోద్, వి.వరలక్ష్మి, కె.రమేష్, పి.రామకృష్ణ, పి.సత్యనారాయణ, కె.గాంధీ, పి.ప్రకాష్, కె.వెంకటేశ్వరరావు, జె.పెద్దిరాజు పాల్గొన్నారు.

యాత్రకు ఘన స్వాగతం

బస్సు యాత్ర పశ్చిమగోదావరి జిల్లా నుండి ఏలూరు జిల్లాలోని కలిదిండి మండలం ఉప్పుటేరు వంతెన వద్దకు ప్రవేశించగానే సిపిఎం మండల కార్యదర్శి శేషు మహంకాళిరావు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. మూలలంక, చినతాడినాడ, కోరుకొల్లు, కలిదిండి శాఖా కార్యదర్శులు, సభ్యులు, అభిమానులు బైక్ ర్యాలీగా తరలి వెళ్లి స్వాగతం పలికారు. కలిదిండి ప్రధాన సెంటర్ వరకూ ర్యాలీగా తరలి వచ్చారు.

సమస్యలపై పోరాడాలని వినతులు

బస్సు యాత్రలో పాల్గొన్న నాయకులను మండలంలోని మూలలంక, భాస్కరరావు పేట, సంతోషపురం, అమరావతి, కోరుకొల్లు గ్రామాల్లో సుమారు వెయ్యి కుటుంబాలు వందేళ్లకు పైగా ఇనేనేషన్ భూముల్లో నివాసముంటున్న తమకు పట్టాలు మంజూరు చేయాలని ఆయా గ్రామస్తులు, అలాగే ఆశ వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు రు.25 వేలు అమలు చేయుండటంతో పాటు సామాజిక భద్రత కల్పించాలని, వేతనాలతో పాటు గ్రాట్యుటీ ఇవ్వాలని, తదితర సమస్యలతో కూడిన వినతులు అందజేశారు.

ఆకట్టుకున్న ప్రజా నాట్యమండలి కళాకారులు

ప్రజా రక్షణభేరీ బస్సుయాత్రలో భాగంగా తొలుత సభా ప్రాంగణానికి ప్రజా నాట్య మండలి కళాకారులు చేరుకున్నారు. ప్రజా సమ్యలపై ప్రజానాట్యమండలి కళాకారులు తమ పాటలతో ఆకట్టుకున్నారు. నృత్యాలు చేస్తూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను పాటల ద్వారా వివరించారు. ప్రజలు ఆసక్తిగా తిలకించారు.

చింతలపూడి మండలంలో సాగునీరు అందక ఎండిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ (ఫైల్)

'కరువు'పై మొద్దునిద్ర..!

జిల్లా అధికారులు నివేదికిచ్చినా స్పందించని ప్రభుత్వం
ప్రాథమిక అంచనాలో 12 వేల ఎకరాల్లో పంటలకు దెబ్బ
కరువు తీవ్రత పెరిగే అవకాశం ఉందని లెక్కలు
ఎంపీ, ఎంఎల్‌ఎలే నష్టం గుర్తించినా స్పందించని ప్రభుత్వం
కరువు మండలాలను ప్రకటించే ఉద్దేశం లేదా అంటూ ప్రశ్నిస్తున్న రైతులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

చాట్రాయిలో వర్షాభావంతో ఎండిన పత్తిచేను

వర్షాభావంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ కరువు మండలాల ప్రకటనలో ప్రభుత్వం మొద్దునిద్ర నటిస్తోంది. జిల్లాలో దెబ్బతిన్న పంటలకు సంబంధించిన లెక్కలు, ప్రస్తుత పరిస్థితిని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేధించినప్పటికీ, దెబ్బతిన్న పంటలను, ఎంపీ, ఎంఎల్‌ఎలు పరిశీలించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకునే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా లేదా అంటూ అన్నదాత ప్రశ్నిస్తున్నాడు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులేర్పడ్డాయి. జూలై నెల మినహా జూన్, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తీవ్ర వర్షపాతం లోటు ఏర్పడింది. దీంతో చింతలపూడి, కామవరపుకోట, చాట్రాయి, బుట్టాయగూడెం వంటి మండలాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్ల నుంచి నీరు రావడంలేదు. చెరువులు అడుగంటాయి. ఫలితంగా ఎక్కడికక్కడే పంటలు నిలువునా ఎండిపోతున్నాయి. ఇప్పటివరకూ వ్యవసాయాధి కారులు ప్రాథమిక లెక్కల ప్రకారం జిల్లాలో 12,017 ఎకరాల్లో వరి, మినుము, పత్తి, చెరకు వంటి పంటలు వర్షాభావ పరిస్థితులతో ఎండిపోతున్నాయని 3,864 ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని, ఇదే పరిస్థితి కొనసాగితే 4,203 ఎకరాల్లో పంటలు దెబ్బతింటాయని నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. ఇవి ప్రాథమిక అంచనాలు మాత్రమే. దెబ్బతిన్న పంటల విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులు అద్దంపడుతున్నాయి. దెబ్బతిన్న పంటలు పశువుల మేతగా మారిపోయాయి. ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. దెబ్బతిన్న పంటల పరిశీలనకు ప్రజాప్రతినిధులు రాకపోవడంపై తీవ్ర విమర్శలు రావడంతో ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజా క్షేత్రస్థాయికి వెళ్లి దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులను అన్నివిధాలా అదుకుంటామంటూ భరోసా ఇచ్చారు. కానీ కనీసం కరువు మండలాలుగా ప్రకటించకుండా రైతులను ఏవిధంగా ఆదుకుంటారో తెలియడం లేదు. అధికారులు నివేదిక ఇచ్చినా, ప్రజాప్రతినిధులు స్వయంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించినా ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థంకావడం లేదు. తమది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పడం తప్ప కష్టంలో ఉన్న అన్నదాతను ఆదుకునే పరిస్థితి లేకుండా పోయింది. పంటను కోల్పోయిన రైతులను ఆదుకోకపోతే రబీ పంట సాగుచేయలేని పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. ఇంత దుర్భర పరిస్థితులు నెలకొన్నా కరువు మండలాల ప్రకటనపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

కరువును గుర్తించకపోవడం దారుణం

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

కొన్ని మండలాల్లో కరువు సమస్య తీవ్రంగా ఉన్నా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం అత్యంత దారుణం. కరువు మరింత తీవ్రమవుతోంది. చాట్రాయి, చింతలపూడి, కామవరపుకోట, బుట్టాయగూడెంతోపాటు కరువు నెలకొన్న మండలాలను వెంటనే ప్రకటించాలి. పంటల బీమా పరిహారం అందించాలి. పశువుల మేత, కరువు సహాయక చర్యలు చేపట్టాలి. ఉపాధి కల్పించి ఆదుకోవాలి. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తాం.

ప్రజారక్షణ భేరికి అపూర్వ ఆదరణ

పశ్చిమలో ముగిసిన సిపిఎం బస్సు యాత్ర
సమస్యలు తెలుసుకుంటూ.. ప్రభుత్వ విధానాలను ఎండగట్టిన నేతలు
ప్రజాప్రణాళికపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం

అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రకు జిల్లాలో అపూర్వ ఆదరణ లభించింది. యాత్రకు ఎక్కడికక్కడే ప్రజానీకం స్వాగతం పలికి నీరాజనం పట్టారు. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో యాత్ర బృందానికి ఎదురెళ్లి తిలకం దిద్ది హారతులు పట్టారు. బైక్, సైకిల్ ర్యాలీలు, బాణాసంచా మోత, తీన్మార్ డప్పులు, కోలాటాల నడుమ యాత్రకు బ్రహ్మరథం పట్టారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను యాత్ర బృందానికి వివరించి వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు పట్ల విసుగుచెందిన ప్రజానీకం సమస్యలను బృందానికి ఏకరువు పెట్టారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం నేతృత్వంలో సాగిన ఈ బస్సు యాత్ర జిల్లాలో మూడు రోజులపాటు సాగింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి ఈ నెల ఏడో తేదీ సాయంత్రం చించినాడ బ్రిడ్జి మీదుగా జిల్లాలోకి ప్రవేశించింది. అక్కడ నుంచి నరసాపురం, పాలకొల్లు, మార్టేరు, తణుకు, తాడేపల్లిగూడెం, కేశవరం మీదుగా జిల్లా కేంద్రం భీమవరం చేరుకుంది. అక్కడ నుంచి ఉండి, ఆకివీడు, ఏలూరు జిల్లా కలిదిండి మీదుగా కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లాలోని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు అభిమానులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు, స్కీమ్ వర్కర్లు, కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాటి రోజుల్లో ప్రజాఉద్యమంలో భాగస్వాములైన సీనియర్ నేతలను రక్షణభేరి యాత్ర బృందం అభినందించి ఘనంగా సత్కరించింది. పది చోట్ల బహిరంగ సభలు జరిగాయి. యాత్ర బృందం సభ్యులు కె.లోకనాథం, మంతెన సీతారాం, కె.ధనలక్ష్మి, ఎవి.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, ఎ.మాల్యాద్రి సభల్లో ప్రసంగించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ఎండగట్టారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్య ధోరణిని వివరించారు. రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేస్తున్నప్పటికీ వైసిపి నోరు మెదపకపోవడం, ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న టిడిపి, ప్రశ్నిస్తానని చెప్పిన జనసేన బిజెపికి వత్తాసు ఎందుకు వత్తాసు పలుకుతున్నాయని నిలదీశారు. ఆశాలు, అంగన్వాడీలు, విఒఎలు, ఎపి సీడ్స్ మహిళలు, ఆటో యూనియన్ కార్మికులు, ఎల్ఐసి ఏజెంట్లు, పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఇలా అన్ని రంగాలకు చెందిన వారు వినతిపత్రాలు అందజేసి తమ సమస్యలను నేతలకు చెప్పుకున్నారు. రోజంతా కష్టపడినా రూ.500 కూడా రావట్లేదని, వృత్తిలో ప్రమాదం చోటుచేసుకుంటే ప్రాణాలు పోతున్నా పట్టించుకునే నాధుడే లేడని కొబ్బరి దింపు, వలుపు కార్మికులు వాపోయారు. అలాగే చేతివృత్తిదారులు, చేనేత, కల్లుగీత కార్మికులు తమ సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. నరసాపురంలో వశిష్ట వారధి నిర్మాణం, ఫిషింగ్ హార్బర్ ఏర్పాటు, మత్స్యకారుల సమస్యలను బృందం దృష్టికి తీసుకొచ్చారు. పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తణుకులో పరిశ్రమలు మూతపడ్డాయని, ముఖ్యంగా సుగర్ ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లులు మూతపడటంతో సుమారు 35 వేల మంది కార్మికులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని విన్నవించారు. చెరకు సాగు అంతరించిపోయిందని, ఇతర అరటి, పూలు, జామ తదితర పంటలకు ప్రోత్సాహం కరువైందని రైతులు వాపోయారు. భీమవరం సభలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బి.వెంకట్, తాడేపల్లిగూడెం సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సిపిఎం రూపొందించిన ప్రజాప్రణాళికపై రక్షణభేరి యాత్ర విస్తృత ప్రచారం నిర్వహించింది. పేద కుటుంబాలకు రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, రూపాయికి విద్యుత్ యూనిట్, రూ.400కే గ్యాస్, ఇల్లు లేని వారికి ఇంటి స్థలం, ఇల్లు, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు.

16న నారాయణపురం ఉప సర్పంచి ఎన్నిక

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం పంచాయతీ ఉప సర్పంచి ఎన్నికకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఉపసర్పంచి అడపా శ్రీనివాసరావు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఈ ఖాళీని భర్తీ చేసేందుకు ఈనెల16న వార్డు సభ్యులు చేతులెత్తి ఉపసర్పంచి అభ్యర్థిని ఎన్నికోనున్నారని కార్యదర్శి జవ్వాధి నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు ఎన్నిక ప్రక్రియ నిర్వహణకు పంచాయతీ విస్తరణాధికారి షేక్ షంషుద్దీన్‌కు విధులు అప్పగిస్తూ గురువారం ఉత్తర్వులిచ్చారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాల ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న నాయకులు

మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలి

బాదంపూడిలో పల్లెకు పోదాంలో వెంకటమంగారావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

పేదలకు సంక్షేమ పథకాలను నేరుగా దళారులు లేకుండా అందించే సిఎం జగన్‌ను తిరిగి గెలిపించుకోవాలని వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు కోరారు. 'పల్లెకు పోదాం'లో భాగంగా జగనే ముఖ్యమంత్రి ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని గురువారం రాత్రి బాదంపూడిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత ప్రభుత్వం వచ్చాక బాదంపూడికి ఎంత అభివృద్ధి చేశారో ఫ్లెక్సీలను ప్రదర్శించారు. పార్టీ జెండాను ఎగురువేశారు. సర్పంచి కంకట పద్మలీల వెంకట్రావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ప్రభుత్వం అన్ని వర్గాలవారికి అన్ని పథకాలిచ్చిందని పథకం నచ్చితే మళ్లీ జగనే ముఖ్యమంత్రి కావాలని మంగారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి దాసరి అప్పన్న, ఎంపిడిఒ ప్రేమాన్విత, ఇఒపిఆర్‌డి షంషుద్దీన్, ఉపసర్పంచి, జెడ్‌పిటిసి సభ్యులు జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బివి.నరసింహరాజు, ఎంపిటిసి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదవేగి: మండలంలోని కొప్పాక ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి పల్లెకుపోదం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశారన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు మేలు, రాష్ట్ర అభివృద్ధి జరిగింది అనుకుంటే మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఎవరికైనా పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని ఎంఎల్‌ఎ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి వైస్‌ఛైర్మన్ విజయబాబు, సర్పంచి, ఎంపిటిసి, బిసి సంఘ నాయకులు గంటా ప్రసాద్, సొసైటీ అధ్యక్షులు భూస్వామి, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, తహశీల్దార్ ఎం.నాగరాజు, సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు న్యాయం దూరం కాకూడదు

ఏలూరు: ఆర్థికంగా వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల వారికి న్యాయం దూరం కాకూడదనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థను ఏర్పాటు చేశారని మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామ్‌గోపాల్ అన్నారు. గురువారం జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా ఏలూరు కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్ భవనంలో రామ్‌గోపాల్ అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలపై పేదలకు అవగాహన కల్పిస్తూ ఈ సంస్థ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

15న ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు మండలంలో ప్రచారయాత్ర

బిజెపి దుష్టపాలన నుంచి ప్రజలను రక్షించేందుకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర సాగుతోందని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభులు ఆర్.లింగరాజు అన్నారు. ఈ యాత్ర ముగింపు సందర్భంగా ఈ నెల 15వ తేదీన విజయవాడలో జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలు మండలంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారం నారాయణపురం, చేబ్రోలు, కైకరం గ్రామాల్లో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సీరా అప్పారావు, నారపల్లి రమణరావు, కె.అప్పారావు, కట్టా భాస్కర్‌రావు, శ్రీరామచంద్రమూర్తి, గోలుకొండ నాగరాజు, జి.గోపీ పాల్గొన్నారు.

నిడమర్రు: ఈనెల 15న విజయవాడలో జరిగే సిపిఎం ప్రజారక్షణ భేరి బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని భువనపల్లి, అడవికొలను, చానమిల్లి తదితర గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నేత నారపల్లి రమణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నేత ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను వంచిస్తున్నాయని, కల్లబొల్లి కబుర్లతో, మోసపూరిత పథకాలతో మోసం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ద్రోహం చేసిందన్నారు. కానీ బిజెపికి రాష్ట్రంలో ఉన్న అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటీపడి మద్దతిస్తున్నాయని విమర్శించారు. ఈ ప్రచారంలో నాయకులు గవర సత్యనారాయణ, కానూరు రాజు. లావేటి సోంబాబు, కట్టా భాస్కర్‌రావు, చీర అప్పారావు, కోర్ని అప్పారావు, జి.గోపి, వి.శ్రీరామచంద్రమూర్తి, పి.నాగరాజు పాల్గొన్నారు.

వరిని ఆశిస్తున్న నల్లి తెగులు

ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త ఫణికుమార్

ప్రజాశక్తి - పోలవరం

వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త

వాతావరణం వేడి వల్ల వరిచేనుకు నల్లి తెగులు ఆశించే అవకాశం ఉందని రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త కె.ఫణికుమార్ సూచించారు. పోలవరం గ్రామంలోని వరిపొలాలను ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి చేను పొట్ట దశలో ఉందని, ఈ తరుణంలో వాతావరణం వేడిగా ఉండటం వల్ల పానికిల్ మైటీ (నల్లి తెగులు) ఆశిస్తుందని, ప్రస్తుతం గింజ గట్టిపడే సమయంలో ఉన్నందువల్ల పురుగుమందులను పిచికారీ చేయాల్సిన అవసరం లేదన్నారు. పొట్ట దశలో ఉన్నప్పుడు డైకో ఫాల్ 5 మిల్లీలీటర్లు లేదా ప్రొపనోఫాస్ రెండు మిల్లీ లీటర్ల నీటిలో కలిపి రెండు పర్యాయాలు పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం వరి చేలల్లో గింజ గట్టి పడే సమయంలో ఎలాంటి పురుగు మందులనూ పిచికారీ అవసరం లేదని, దానివల్ల అదనపు ఖర్చు రైతుకు భారం తప్పితే ఉపయోగం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కో ఆర్డినేటర్ డాక్టర్ టి.సుజాత, శాస్త్రవేత్త నాగేంద్రబాబు, మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ దత్తి రాంబాబు, ఆర్‌బికె ఛైర్మన్ పొన్నూరు నరసింహారావు, రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కాలువలు కలుషితం కాకుండా చర్యలు

ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్ణయం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

మండలంలోని పలు గ్రామాలకు వెళుతున్న పంటకాలువల్లోకి ఏలూరు నగర పరిధిలోని మురుగు నీటి వ్యర్థాలు చేరడంపై మండల సర్వసభ్య సమావేశం తీవ్రంగా ఆక్షేపించింది. తాగునీటి చెరువులకు పంపిణీ చేస్తున్న నీరు కలుషితం కావడం వల్ల ప్రజలు రోగాలబారిన పడుతున్నారని, దీన్ని నిలువరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. సర్వసభ్య సమావేశం శుక్రవారం సాయంత్రం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి పెన్మత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగింది. విద్యుత్, విద్య, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్, వ్యవసాయ శాఖ, గృహనిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్‌పై సమీక్షిస్తూ ఏలూరు నగరం మీదుగా పాండురంగ థియేటర్ వద్ద నుంచి ప్రవహించే పంట కాలువ, జాలిపూడి కాలువలు నగర మురుగుతో కలవడం, పలు ఇళ్ల నుంచి వచ్చే నీటిని నేరుగా కాలువల్లోకి వదిలేస్తుండటంతో తాగునీరు కలుషితం అవుతుందని మాదేపల్లి సర్పంచి ప్రభుదేవ, జాలిపూడి నాయకులు రాము సమావేశం దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపిపి శ్రీనివాస రాజు మాట్లాడుతూ తాగునీటి కలుషితంపై తీవ్రంగా చర్చించాల్సిన అవసరం ఉందని, త్వరలో దెందులూరు ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరితో మాట్లాడి సంబంధిత శాఖలకు తగిన అదేశాలిస్తామన్నారు. మల్కాపురం ఎంపిటిసి బొమ్మవరపు మణి గోకనేసు మాట్లాడుతూ పంట కాలువల్లో మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకో వడానికి నగరపాలక అధికారులతో సమావేశం ఏర్పాటు చేస్తే బాగుంటుందన్నారు. ఎంపిపి జోక్యం చేసుకుంటూ 'మన కాలువ గట్లను పటిష్టం చేసుకున్నాకనే ఇతర శాఖలతో సమన్వయం చేసుకుందాం' అని అన్నారు. గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారి మాట్లాడుతూ వాటర్ గ్రిడ్ పథకం అమల్లోకి వస్తే 22 గ్రామాలకు స్వచ్ఛమైన గోదావరి నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ఏర్పడుతోందని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపిపి శ్రీనివాసరాజు అధికారులను అదేశిచారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మాట్లాడుతూ మహేశ్వరపురం, మొండికోడు స్కీంల నుంచి నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతోందని, ప్రత్తికోళ్లలంక, మాధవాపురంలో కొంత సమస్య ఉందని, శ్రీపర్రు, గుడివాకలంక, మాదేపల్లి, మనూరులో తాగునీటి సమస్య ఉన్న దృష్ట్యా త్వరలో పైప్ లైన్లు నిర్మించి సమస్య లేకుండా చూస్తామని చెప్పారు.

11 పాఠశాలల్లో నాడు-నేడు

మండల పరిధిలో 30 మండల పరిషత్ పాఠశాలలుండగా 11 పాఠశాలలో నాడు-నేడు పనులు సాగుతున్నాయని ఎంఇఒ-2 రంగయ్య తెలిపారు. ఈ నెలాఖరులోపు పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో నిర్మిస్తున్న సచివాలయ భవనాలను డిసెంబర్‌లోగా పూర్తిచేయాలని ఏలూరు ఎంపిపి శ్రీనివాసరాజు, ఎంపిడిఒ ప్రణతి అధికారులను ఆదేశించారు.

అందరూ డ్రైడే పాటించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

డ్రై డే పాటించడం ద్వారా దోమకాటు ద్వారా వచ్చే డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చని ఆరోగ్య విస్తరణ అధికారి అబ్రార్‌హుసేన్ అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే కార్యక్రమంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి శుక్రవారం నీటి తొట్టెలను శుభ్రపరచుకుని పొడిగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భరత్‌కుమార్, విష్ణుమూర్తి, నర్సావా, మల్లిక, జ్యోతి, మరియమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ధృవపత్రాలు అందిస్తున్న నాగకుమార్

ఇ-క్రాప్ నమోదు పత్రాలు అందజేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఇ క్రాప్ నమోదు చేసుకున్న నమోదు ధ్రువపత్రం తీసుకోవాలని చింతలపూడి వ్యవసాయ ఉప సంచాలకులు నాగకుమార్ అన్నారు. పట్టణంలో ఆర్‌బికెలో రైతులకు ఇక్రాప్ నమోదు ధ్రువపత్రాలను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ శ్రీనివాసరావు, రైతులు అంజిబాబు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని నాలుగో వార్డు ఇందిరా నగర్ కాలనీ ఎంపిపి పాఠశాలకు కొత్తపల్లి సోదరుల వితరణతో కెఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు బీరువా అందించారు. కీర్తిశేషులు కొత్తపల్లి నాగేశ్వరరావు, శేషమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు శ్రీను, నాగు, నరేష్, సురేష్ స్థాపించిన కెఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్విరామంగా పలు సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలకు మౌలిక వసతులు కల్పించడం కోసం బీరువా అందించారు. ఈ కార్యక్రమానికి స్థానిక నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి), 26వ వార్డు కౌన్సిలర్, పట్టణ అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య (అచ్చిరాజు) హాజరై మాట్లాడుతూ పాఠశాలకు మౌలిక వసతులు కల్పించడంలో దాతల సహకారాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ లోకారపు వెంకటేశ్వరరావు (ఎల్‌విఆర్) సామాజికవేత్త ధనకుమార్ పాల్గొన్నారు.

బోనస్‌లు అందిస్తున్న ఆంజనేయులు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పాడి రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కృష్ణ మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. మండలంలోని జంగంగూడెం సొసైటీలో 135 మంది పాడి రైతులకు రూ.4,16,215 బోనస్ గురువారం అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు డివి.సుబ్బారావు, మేనేజర్ కిలారి కిరణ్ కుమార్, సూపర్‌వైజర్ వీరాంజనేయులు, పాడి రైతులు పాల్గొన్నారు.

జామ రైతులకు పలు సూచనలు

ముసునూరు :జామ తోటలో నల్లి పురుగు, పండిపురుగును జీవామృతం పదార్థాలతో నివారించవచ్చని ఉద్యానవన అధికారి కె.జ్యోతి ప్రియాంక అన్నారు. మండలంలోని గుడిపాడులో కొల్లి గంగారామ్, గద్దె రఘుబాబుల జామ తోటలను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు.

'రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం'

ప్రజాశక్తి - టి.నరసాపురం

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టిడిపి పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు అన్నారు. టి.నరసాపురంలో గురువారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పార్టీ మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీరామమూర్తి, శీలం వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, నల్లూరి వెంకట చలపతిరావు, తోట లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి మోహన్‌రావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల ఎస్‌సి కాలనీలో గురువారం నిర్వహించిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకటరాజు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, మట్టపర్తి రూపేష్‌కుమార్, లంకా సత్తిపండు, రేపూరి వెంకటేశ్వరరావు, జనసేన నాయుకులు తరగళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలపూడి : టిడిపితోనే బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని ప్రగడవరం టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లురు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామపంచాయతీలోని 171 బూత్‌లో గురువారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 171 బూత్ కన్వీనర్ చక్రపు మారేశ్వరరావు, పార్టీ గ్రామ సెక్రటరీ బుద్దాల నాగవర్ధన్, తుమ్మూరి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
ఉద్యోగ అవకాశం
ఆఫీసు అసిస్టెంట్
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత:
ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
యాడ్స్ డిజైనర్:
ఏలూరు కేంద్రంగా పనిచేయుటకు కావలెను.
విద్యార్హత: ఏదైనా డిగ్రీ/ఇంటర్ పూర్తి చేసి,
తెలుగు, ఇంగ్లీషు టైపింగ్ వచ్చి పేజ్‌మేకర్/క్వార్క్ ఎక్స్‌ప్రెస్,
ఫోటోషాప్‌లలో ప్రావీణ్యం ఉన్నవారికి ప్రాధాన్యత.
అనుభవాన్ని బట్టి ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును
ఆసక్తి గలవారు పూర్తి వివరాలతో బయోడేటాను మెయిల్ చేయండి
wgpraja@gmail.com
సంప్రదించాల్సిన నెంబర్లు 94900 99177, 94900 99186

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని వినతి

ప్రజాశక్తి - చాట్రాయి

చిన్నంపేట గ్రామంలో ఉపాధి హామీ పనులు చేయించేందుకు ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని ఉపాధి హామీ చట్టం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీదేవికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం గురువారం వినతిపత్రం అందించారు. ప్రస్తుతం పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్ము నాగేశ్వరరావుపై వచ్చిన ఫిర్యాదు విచారణకు ఎంపిడిఒ కార్యాలయానికి వచ్చిన ఆమెకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కొమ్ము ఆనందం మాట్లాడుతూ చిన్నంపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలు అత్యధికంగా ఉన్నారని, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించితే పని సులువుగా చేసుకోగలరన్నారు. ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు.

40,455 మంది రైతులకు రూ.16.70 కోట్లు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు డివిజన్‌లో మొత్తం 40,455 మంది రైతులకు రైతు భరోసా పథకంలో రూ.16.70 కోట్ల నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ శాఖ ఎడిఎ విద్యాసాగర్ తెలిపారు. రెండో విడతలో భాగంగా ఒక్కొక్క రైతుకు రూ.నాలుగు వేల నగదు నేరుగా వారి ఖాతాల్లో జమ అవుతుందన్నారు. రైతులకు వ్యవసాయ ఖర్చుల నిమిత్తం ఈ నగదు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు యాజమాన్య పద్ధతులను తెలియజేస్తున్నామని చెప్పారు.

స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఒకరోజు శిక్షణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు స్థానిక డివైఇఒ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఇఒ ఎం.సేవియా మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తిపరమైన విజ్ఞానాన్ని నిరంతరం పెంపొందించుకుంటూ ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంఇఒలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

దుకాణాల్లో మున్సిపల్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలోని పలు దుకాణాల్లో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల విక్రయంపై మున్సిపల్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను వినియోగించే దుకాణదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం క్యారీ బ్యాగుల వినియోగం నిషేధించామన్నారు. క్యారీ బ్యాగులు వినియోగిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం ఈ నెల పదో తేదీ శుక్రవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ మల్లీశ్వరి తెలిపారు. ఎన్‌జిఆర్‌ఎస్‌ఇ పీడీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి సంబంధిత అధికారులు, మండలంలోని అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఉంగుటూరు

యర్రమళ్ల 33 కెవి ఫీడర్ మార్గంలో చెట్ల నరికివేత కారణంగా ఈ నెల పదో తేదీ ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నారాయణపురం విద్యుత్ ఎఇఇ శ్రీరామ్ తెలిపారు. యర్రమళ్ల, ఉంగుటూరు, చేబ్రోలు సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

సస్యరక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మామిడి పూత సకాలంలో రావడానికి లీటర్ నీటికి మల్టీ-కె పది గ్రాములు, అగ్రోమిన్ మ్యాక్స్ ఐదదు గ్రాములు, క్లోరిఫైరిపాస్ 2.5 మిల్లీలీటర్లు కలిపి పిచికారీ చేయాలని మామిడి పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.కనకమహాలక్ష్మి రైతులకు సూచించారు. మండల పరిధిలోని అడవినెక్కలం గ్రామంలో మామిడి రైతులకు మామిడి పూత, పిందె దశలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు గుర్రం శ్రీనివాసరావు, గ్రామీణ ఉద్యాన సహాయకులు పి.రమేష్, మామిడి రైతులు పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు అరికట్టాలి

నేడు, రేపు నిరసనలకు వామపక్షాల పిలుపు

ఏలూరు అర్బన్ :పాలస్తీనాపై ఇజ్రాయేల్ దాడులు అరికట్టాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10, 11 తేదీల్లో నిరసనలకు వామపక్షాలు పిలుపునిచ్చాయి. స్థానిక పవర్‌పేట సిపిఎం కార్యాలయంలో పి.కిషోర్ అధ్యక్షతన సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎంసిపిఐ (యు) పార్టీల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సమితి కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్రంలో పది వామపక్ష పార్టీల పిలుపులో బాగంగా ఈ నెల 10, 11 తేదీల్లో జిల్లాలో అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో జరిగే నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలని కోరారు. పాలస్తీనా, గాజాపై ఇజ్రాయేల్ బాంబులు వర్షం కురిపిస్తుందన్నారు. ఆసుపత్రుల మీద చేయడం సిగ్గు చేటన్నారు. అమెరికా వత్తాసుతో పాలస్తీనాపై ఇజ్రాయిల్ ఎగబడుతుందన్నారు. భారత దేశం విదేశీ విధానంలో గత తన అలీన విధానాన్ని వీడనాడి, అమెరికా ఎటు చెపితే అటు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. ప్రపంచ శాంతి కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి యు.హేమశంకర్, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఏలూరు కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎంసిపిఐయు జిల్లా నాయకులు ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

డయాలసిస్ పేషెంటుకు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

సేవే పరమావధిగా భావించి ఓ డయాలసిస్ పేషెంట్‌కు నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్ర సిబ్బంది గురువారం పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డయాలసిస్ కేంద్ర ఇన్‌ఛార్జి పి.రాహుల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు సత్యనారాయణరెడ్డి

చింతలపూడి :కారుమూడి సత్యనారాయణరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని కేంద్ర, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని సిపిఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్రారెడ్డి అన్నారు. కారుమూడి సత్యనారాయణరెడ్డి 27వ వర్ధంతి ఎర్రగుంటపల్లి గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి పుల్లూరి సోమశేఖర్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చింతలపూడి తాలూకా పార్టీ నిర్మాతల్లో కారుమూడి సత్యనారాయణ రెడ్డి ఒకరిని, నియోజకవర్గంలో పార్టీ నిర్మాణం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామంలో హైస్కూల్ రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడేవారని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఈ ప్రాంతం నుంచి పాల్గొన్న వారిలో కారుమూడి సత్యనారాయణరెడ్డి ఒకరిని, ఆ సమయంలోనే పోలీసులు అరెస్టు చేసి కడలూరి జైలుతో నిర్బంధించారని, రైతు సమస్యలపై విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా నిడదవోలులో జరిగే బహిరంగ సభకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారన్నారు. కారుమూడి సత్యనారాయణరెడ్డి ఉద్యమ స్ఫూర్తితో సిపిఐ కార్యకర్తలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడి విజయం సాధించిన రోజే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అన్నారు. తొలుత సీనియర్ నాయకులు తలారి గంగరాజు, శ్రీరామాచార్యులు మతవీరుల జెండాను సిపిఐ జెండాలను ఆవిష్కరించగా సత్యనారాయణ రెడ్డి విగ్రహానికి పూలమాలతో అక్కడకు వచ్చిన సభ్యులంతా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, సిపిఐ మండల కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె.మస్తాన్, ఎంపిటిసి సభ్యులు టి.విజయభాస్కర్, పౌర హక్కుల సంఘం నాయకులు ముత్తారెడ్డి, కోలా ఏడుకొండలు, ఉమ్మడి రాజారావు, సిపిఐ నాయకులు ఆరేపల్లి సుబ్బారావు, వెంకటేశ్వరరావు, రానుబోయిన నారాయణ, మింటే సువర్ణరాజు పాల్గొన్నారు.

చినవెంకన్న ప్రాణదాన ట్రస్టుకు మందులు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాణదాన ట్రస్టు ద్వారా నిర్వహిస్తున్న ఉచిత ప్రథమ చికిత్స కేంద్రానికి ఉచిత మందులను గురువారం అందించారు. నడకదారి వచ్చే భక్తుల కోసం సుమారు రూ.పది వేల విలువైన ఉచిత మందులను విజయవాడ వాస్తవ్యులు భాస్కర్ మెడికల్ ఏజెన్సీ అధినేత సురేష్ సహాయ సహకారాలతో విజయవాడకు చెందిన దాతలు తాత వెంకటసుబ్రహ్మణ్యం, వివిఎస్‌డి మెడికల్ ఏజెన్సీ విజయవాడ వారు ద్వారకా తిరుమల దేవస్థానం ఎఇఒ లక్ష్మణస్వామి చేతులమీదుగా ఈ మందులు అందించారు. వారికి దేవస్థానం తరపున జాయింట్ కమిషనర్ వేండ్ర త్రినాధరావు ఆదేశాల మేరకు ప్రాథమిక చికిత్స కేంద్రం వైద్యులు రాజేంద్రప్రసాద్ ధన్యవాదాలు తెలిపారు. వారికి స్వామి వారి దివ్య దర్శనం ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో దుర్గాప్రసాద్ ఎఎన్ఎం చిన్నారి పాల్గొన్నారు.

మందులు అందిస్తున్న ఎఇఒ లక్ష్మణస్వామి

మహిళల ఆర్థికాభివృద్ధికి 'జగనన్న పాలవెల్లువ'

మహిళలకు పాలవెల్లువ చెక్కులు అందిస్తున్న చక్రవర్తి

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళల ఆర్థికాభివృద్ధికి జగనన్న పాలవెల్లువ దోహదపడుతుందని మక్కినవారిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ పిన్నమనేని చక్రవర్తి అన్నారు. స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జగనన్న పాలవెల్లువ చెక్కులను గురువారం చక్రవర్తి చేతులమీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాలవెల్లువ ద్వారా మంజూరైన ఎనిమిది మంది మహిళలకు ఒక్కొక్కరికి రూ.30 వేలు చొప్పున రూ.2.40 లక్షల చెక్కులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఇఒ యువివి.సత్యనారాయణ, గోపి పాల్గొన్నారు.

వికలాంగులకు పరికరాలు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన వికలాంగుడు మండెల్లి బుల్లి వెంకట్రాజుకు దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ వారి ఆధ్వర్యంలో ఎఎస్ఒ జోడాల వెంకట్ చేతులమీదుగా గురువారం క్రచ్చర్స్ అందించారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ దేవోక్తి చిడిపి సోషల్ సర్వీస్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నామని తెలిపారు. గురువారం పలు గ్రామాల్లో రూ.పది వేల విలువైన మూడు జతల క్రచ్చర్స్, ఐదు వాకర్లు వికలాంగులకు వారి ఇంటి వద్దకు వెళ్లి ఇచ్చామని తెలిపారు. కృత్రిమ అవయవాలు, వాకర్లు, క్రచ్చర్స్ కావాల్సినవారు 9391089381 నెంబర్‌ని సంప్రదించాలని చెప్పారు. ఎఎస్ఒ జోడాల వెంకట్, టీచర్ సునీత, దాస్ కల్యాణి, పద్మ, శాంతి, సుభాషిని ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో అబెడ్నేగో, తొర్లపాటి రాజీవ్, కిషోర్ పాల్గొన్నారు.

వికలాంగుడికి క్రచ్చర్లు అందిస్తున్న వెంకట్

సూరప్పగూడెంలో 'పాలన బాగుండాలంటే పవన్ రావాలి'

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం పాలన బాగుండాలంటే పవన్ రావాలి కార్యక్రమం ఆ పార్టీ ఉంగుటూరు నియోజకవర్గ కన్వీనర్ పత్సమట్ల ధర్మరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కార్యకర్తలు, జన సైనికులతో కలిసి మండలంలోని సూరప్పగూడెం గ్రామంలో ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ భీమడోలు మండల నాయకులు పత్తి మదన్ పాల్గొన్నారు.

పలుచోట్ల 'పల్లెకు పోదాం'

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో చేసిన ప్రగతి గురించి వివరించేందుకు ఏర్పాటుచేసిన పల్లెకు పోదాం (మా నమ్మకం నువ్వే జగనన్న) బోర్డుల ఆవిష్కరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమడోలు ఎంపిపి కనమాల రామయ్య కోరారు. కురెళ్లగూడెం గ్రామ సచివాలయంలో సర్పంచి జి.నాగగౌతమి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమ పర్యవేక్షణ అధికారిగా భీమడోలు వ్యవసాయ అధికారి ఉషారాణి వ్యవహరించారు.

చాట్రాయి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పల్లెకు పోదాం కార్యక్రమం గురువారం మండలంలోని చనుబండ గ్రామ సచివాలయం-2లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ దేశిరెడ్డి .రాఘవరెడ్డి మాట్లాడారు. అనంతరం సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఇఒపిఆర్‌డి మురళీకృష్ణ అధ్యక్షత వహించారు.

పోలవరం : పోలవరం పంచాయతీలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకట్‌రెడ్డి మాట్లాడారు.

టి.నరసాపురం : సిఎంగా జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో భాగంగా గురువారం టి.నరసాపురం సచివాలయం-2 వద్ద ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణ రాజు (సూరిబాబు) మాట్లాడారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాల బోర్డులను ఆవిష్కరించారు.

ముసునూరు : మండలంలోని సూరేపల్లి గ్రామ సచివాలయంలో గురువారం పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెడ్‌పిటిసి సభ్యులు డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కోటగిరి రాజానాయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గంగాధరరావు, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, ఎంపిటిసి సభ్యులు కొండా దుర్గాభవాని, పుచ్చకాయల వెంకటేశ్వరరావు, సర్పంచులు పేరం కృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి...

జీలుగుమిల్లి :మండలం వ్యాప్తంగా నవంబర్ పదో తేదీ నుంచి 23 వరకు పల్లెకు పోదాం కార్యక్రమన్ని నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కెఆర్‌ఎస్.కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమం జరిగే సచివాలయ పరిధిలో ప్రతి వాలంటీర్ ఆయా క్లస్టర్ పరిధిలో పాల్గొనాలన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లిస్టలను ఆయా సచివాలయ నోటీస్ బోర్డ్‌ల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు

ముసునూరు : నా బార్డు వారి సౌజన్యంతో రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు బ్యాంకు మేనేజర్ జి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ముసునూరు వ్యవసాయ పరపతి సంఘంలో బ్యాంకు ఛైర్మన్ తాతినేని పద్మావతి ఆదేశాల మేరకు నగదు రహిత లావాదేవీలపై సొసైటీ సిఇఒ దాసిరెడ్డి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్క రైతు పొదుపు ఖాతా తెరవాలని, కిసాన్ క్రెడిట్ కార్డు పొంది ఉండాలని, ఎటిఎం కార్డు, డెబిట్ కార్డు వాడకం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కళాకారులతో ఆటలు, పాటలతో నృత్యాలు చేస్తూ రైతులకు అవగాహన కల్పించారు.

చెరువుల్లో పూడికతీత ముమ్మరం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాభావ పరిస్థితి ఉన్న నేపథ్యంలో చెరువుల పూడిక తీతను ముమ్మరం చేసి నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు చేపట్టాలని జెడ్‌పిటిసి సభ్యులు మోలుగుమాటి నీరజసుధాకర్ చెప్పారు. మండలంలోని శివపురంలో గురువారం నిర్వహించిన గ్రాహసభలో నీరజసుధాకర్ మాట్లాడారు. మండల పరిషత్ పాఠశాల వద్ద నీటి సదుపాయం లేకపోవడంతో ఎంపిపి రాంబాబును అడగడంతో అక్కడ బోరు వేసేందుకు నిధులు మంజూరు చేయడానికి అంగీకరించినట్లు తెలిపారు.

24న ఎపియుడబ్ల్యూజె మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈ నెల 24వ తేదీన నిర్వహించే ఎపియుడబ్ల్యూజె మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మాణిక్యలరావు పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఎపియుడబ్ల్యూజె ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎపియుడబ్ల్యూజె జిల్లా మహాసభ నగరంలోని సారధి కళ్యాణమండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం జర్నలిస్ట్ ఇళ్ల స్థలాల కలను సాకారం చేస్తున్న సిఎం జగన్‌కు కృజ్ఞతలను తెలియజేస్తూ కేక్ కట్ చేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఉపాధి హామీ చట్టం ఫీల్డ్ అసిస్టెంట్ కొమ్ము నాగేశ్వరరావు కొందరు ఉపాధి కూలీలను బెదిరిస్తున్నారని స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయగా కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిషత్ కార్యాలయంలో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీదేవి, ఎంపిడిఒ కె.దుర్గాప్రసాద్, ఎపిఒ జి.లక్ష్మీకుమారి సమక్షంలో గురువారం విచారణ చేశారు. ఈ విచారణకు 58 మంది ఫిర్యాదుదారులకు కేవలం 13 మంది మాత్రమే హాజరయ్యారని, వారిలో ముగ్గురు తమను ఎవరూ బెదిరించలేదని తెలుపగా, బెదిరించారని పది మంది చెప్పారని అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శ్రీదేవి తెలిపారు. మరో ఇద్దరు ఇదంతా ఫీల్డ్ అసిస్టెంట్ నాగేశ్వరరావుపై కొందరు రాజకీయ కక్షతో అతడిని తొలగించాలనే దురుద్దేశంతో చేయిస్తున్న ఫిర్యాదులు తప్ప మరొకటి కాదని చెప్పారని తెలిపారు. విచారణ రిపోర్టులను ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.

మెనూ ప్రకారం పోషకాహారం అందించాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సకాలంలో పోషకాహారం అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శర్మిష్ట ఆదేశించారు. మండల పరిధిలోని నూగొండపల్లి గ్రామంలో హెల్త్, వెల్‌నెస్ సెంటర్, అంగన్‌వాడీ సెంటర్, ఎంపియుపి పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని కోరారు. నిర్మాణంలో ఉన్న ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని, ప్రస్తుత భవనాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి-1 జె.జగన్మోహనరావు, వైద్యాధికారి-2 ఎస్‌కె.టీనా, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది హుండీ ఆదాయం రూ.27,21,199

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని గురవాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి ఆలయ హుండీ లెక్కించగా రూ.27,21,199 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.కొండలరావు తెలిపారు. తనిఖీదారు ఎ.సుజన్‌కుమార్ పర్యవేక్షణలో కెబివి.బ్యాంక్ సిబ్బంది హుండీలను లెక్కించగా 40 రోజులకు రూ.27,21,199 ఆదాయము వచ్చిందని తెలిపారు.

వేతనాల విడుదలపై కమిషనర్‌కు ధన్యవాదాలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఇంజినీరింగ్ అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందికి ఇవ్వాల్సిన వేతనాల ఎరియర్స్ బకాయిలు పూర్తిగా ఈ నెల ఎనిమిదో తేదీ బుధవారం చెల్లించినందుకు కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణకు ఎఐటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అభినందనలు తెలిపింది. ఎన్‌ఎంఆర్‌లకు బకాయి పడిన రెండు నెలల వేతనాలు కూడా చెల్లించినందుకు ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు కమిషనర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఏలూరు నగరపాలక సంస్థలో విలీనమైన ఏడు పంచాయతీల అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగ సిబ్బందికి బకాయిపడిన 2022 జూన్ మాసం వేతనం కూడా చెల్లించాలని కమిషనర్‌ను వారు కోరారు. ఒకేసారి బకాయి వేతనం చెల్లించేందుకు అవకాశం లేకపోతే మూడు పంచాయతీలు ఒకసారి మరో నాలుగు పంచాయతీలకు మరొకసారి వేతనాలు చెల్లించేందుకు కమిషనర్ చర్యలు తీసుకోవాల్సిందిగా వెంకటేశ్వరరావు, అప్పలరాజు విజ్ఞప్తి చేశారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటు అయిన శ్రీమతి గుండపనేని వెంకట నాగ సత్యవతి, W/o. లక్ష్మీనారాయణ, డో.నెం. 1-14, ప్రకాశ్‌నగర్, బోగాపురం, పెదవేగి మండలం, ఏలూరు జిల్లా వారు ఇచ్చిన వివరములు ప్రకారము నా క్లయింటు మరియు ఆమె భర్త కలసి ది. 2-11-2023వ తేదీన కొప్పాక సొసైటీ బ్యాంకుకు వెళ్ళి మరల తిరిగి ఇంటికి ఆటోలో బయలుదేరి వెళ్తుండగా దారిలో బ్యాగ్ జారిపోయినది. దానిలో నా క్లయింటు పొలం తాలూకా R.S. No. 75 లో 0.70 సెంట్లుకు సంబంధించిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. ఆ ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది నా చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

శ్రీ వెలగపూడి వెంకటేశ్వరరావు
న్యాయవాది, శాంతినగర్, 11వ రోడ్డు
శ్రీ లక్ష్మీసాయి టవర్స్, ఫ్లాట్ నెంబర్: 203
ఏలూరు, ఏలూరు జిల్లా
సెల్: 9849669124

నరసాపురం పురపాలక సంఘము

నరసాపురం పురపాలక సంఘము నందు గడప గడపకు మన ప్రభుత్వం (GGMP) నిధులు & మునిసిపల్ సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టుటకు

ఇ-ప్రొక్యూరుమెంటు షార్టు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.393/2023-ఇ-1, తేది.09-11-2023

1. బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం : 10-11-2023 ఉ॥ గం॥ 11.30లకు
2. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 17-11-2023 సా॥ గం॥ 4.00లకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం : 17-11-2023 సా॥ గం॥ 4.30లకు

ఇ-ప్రొక్యూరుమెంటు టెండరు నోటీసు

ఆర్.ఓ.సి. నెం.427/2022-ఇ-2, తేది.09-11-2023

1. బిడ్ అమ్మకం ప్రారంభ తేది మరియు సమయం : 10-11-2023 ఉ॥ గం॥ 11.30లకు
2. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం : 27-11-2023 సా॥ గం॥ 4.00లకు
3. ప్రైస్ బిడ్ తెరచు తేది మరియు సమయం : 27-11-2023 సా॥ గం॥ 4.30లకు

తదుపరి వివరాలను www.eprocurement.gov.in లోని 'e' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును.

నరసాపురం పురపాలక సంఘం
నరసాపురం, ఫోన్ నెం. 08814273578

సం/- **కమిషనరు**
నరసాపురం మునిసిపాలిటీ